# జర్నలిస్ట్ డైరీ


తెలుగు దినపత్రిక








సంపుటి :12 సంచిక :307 మంగళవారం 7-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/

# మణిపూర్‌లో ఉగ్రదాడి..

- అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు వీరమరణం
- నుంగ్షాంగ్ కాంగ్ ప్రాంతంలో బాంబు దాడులు, కాల్పులు
- రెండు గంటలపాటు కొనసాగిన తీవ్ర కాల్పులు, పేలుళ్లు
- షాంగ్‌షాక్ బెటాలియన్ సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు సమాచారం

2

మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన మెరుపు దాడిలో అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు ధీర జవాన్లు వీరమరణం పొందారు. నుంగ్షాంగ్ కాంగ్ ప్రాంతంలో విధులు ముగించుకుని తిరిగి వస్తున్న 40 అస్సాం రైఫిల్స్ (షాంగ్‌షాక్ బెటాలియన్) సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ముష్కరులు బాంబు దాడులు, కాల్పులకు తెగబడ్డారు. దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన ఈ భీకర కాల్పుల్లో మరికొందరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, అదనపు బలగాలతో కూంబింగ్ ముమ్మరం చేశారు.



# పీవోకేలో ఉద్యమం ఉధృతం..

- పాక్ ప్రభుత్వానికి జేఏఏసీ 48 గంటల అల్టిమేటం
- డిమాండ్లు నెరవేర్చకుంటే 9న తుది స్పందన చూస్తారని తీవ్ర హెచ్చరిక
- పీవోకేకు రావాలని ఓఐసీ, అంతర్జాతీయ మీడియాకు ఆహ్వానం
- ప్రజలు, ప్రవాస కశ్మీరీలు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపు
- మీర్‌పూర్ మహిళల పోరాట స్ఫూర్తికి జేఏఏసీ ప్రశంసలు

న్యూఢిల్లీ :

పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో రాజకీయ దుమారం తీవ్రమవుతున్న తరుణంలో జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఇస్లామాబాద్‌లోని ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించింది. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే జూలై 9న "భారీ, తుది స్పందన" ఉంటుందని హెచ్చరించింది. జూలై 9న జరుగబోయే నిరసనలో పీవోకే వ్యాప్తంగా ఉన్న నివాసితులు, కశ్మీరీ ప్రవాసులు పాల్గొనాలని కమిటీ పిలుపునిచ్చింది.పీవోకేలో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను స్వయంగా పరిశీలించడానికి రావాలని ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (వోఐసీ), అంతర్జాతీయ మీడియా సంస్థలను జేఏఏసీ అధికారికంగా అభ్యర్థించింది. పూంచ్, మీర్‌పూర్ డివిజన్ల ప్రజలకు -మిగతా 2 లో



# కేసీఆర్ అసెంబ్లీకి రావాలి

- కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలి
- కేసీఆర్ తేదీ చెబితే ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధం
- కాళేశ్వరం అవినీతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ముందే చర్చిద్దాం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ డైరీ)

దేశంలోనే "ఎనిమిదో వింత"గా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందో, వేల కోట్ల ప్రజాధనం ఎలా వృథా అయిందో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం సూచిస్తే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలతో కలిసి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, డబుల్ బెడ్‌రూమ్ -మిగతా 2 లో

# పర్యాటక రంగం ప్రక్షాళనకు శ్రీకారం


## దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలి



- తారామతి బారాదరిని ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి
- దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి
- మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌస్ లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి
- టూరిజం హబ్ డెవలప్ మెంట్ పథకం కింద వికారాబాద్ ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి
- వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ)

తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్ లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై పలు కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం.. తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంకా మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌస్ లను ఆధునిక సౌకర్యాలతో -మిగతా 2 లో




# మాకు భారత్ ఉంది.

- అమెరికా మాత్రమే కాదు.. భారత్ కూడా మా మిత్రదేశమే'
- జేడీ వాన్స్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన నెతన్యాహు
- భారత్ నుంచి అపార మద్దతు లభిస్తోందన్న ఇజ్రాయెల్ ప్రధాని
- ప్రపంచ నేతల మద్దతు తమకు కొనసాగుతోందని వ్యాఖ్య
- అమెరికా--ఇజ్రాయెల్ సంబంధాలపై కొత్త చర్చకు తెర

జెరూసలేం(జర్నలిస్ట్ డైరీ)

ఇజ్రాయెల్‌కు ఉన్న ఏకైక శక్తివంతమైన మిత్రదేశం అమెరికా మాత్రమేనంటూ ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తోసిపుచ్చారు. 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ వాన్స్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నప్పటికీ, ఆయన ప్రతి మాటనూ ఏకీభవించనంటూ 'మాకు భారత్ వంటి మరికొన్ని మిత్రదేశాలు ఉన్నాయని, 140 కోట్ల జనాభా కలిగిన ఆ చిన్న దేశం(వ్యంగ్య ధోరణిలో) నుంచి మాకు అపారమైన మద్దతు లభిస్తున్నది' అని అన్నారు.స్వదేశీ రాజకీయ ఒత్తిళ్లు -మిగతా 2 లో

# దక్షిణ పసిఫిక్‌లో బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన చైనా



2



# మహారాష్ట్రలో..జల ప్రలయం

- పుణే జిల్లాలో విరిగిపడిన కొండచరియలు
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- శిథిలాల్లో చిక్కుకున్న మరో 30 మంది
- ముంబైలో వర్ష సంబంధిత ఘటనల్లో 8 మంది మృతి
- ముంబైపుణే ఎక్స్‌ప్రెస్‌వే, హైవేపై పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు
- ముంబై సహా పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ

2

వారం రోజులుగా ఎడతెగని వానలు

# దేవుడి పేరుతో రాజకీయమా?

## అయోధ్యలో కోట్ల అవినీతి జరిగింది




అయోధ్య ట్రస్ట్ ప్రధాని మోడీ, అమిత్ షా,ముఖ్యమంత్రి కి సన్నిహితులు

- దీనిపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదు
- రామ జన్మభూమి నిర్మాణం జరగాలని శిలాన్యాసం వేసిన రాజీవ్ గాంధీ
- బీజేపీ నేతలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ)

దేవుడి పేరుతో రాజకీయం చేయడం సరికాదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అయోధ్య లో రామ జన్మభూమి నిర్మాణం జరగాలని శిలాన్యాసం రాజీవ్ గాంధీ వేశారని పేర్కొన్నారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. భారతదేశ ప్రజలు హిందువుల విశ్వాసం అయోధ్య లో రామ మందిరం కోసం ఎంతో మంది డొనేషన్లు ఇచ్చారు. అయోధ్య రామమందిరం లో కోట్ల రూపాయల అవినీతి జరిగింది.. దీనిని అయోధ్య ప్రజలు ముందుగానే గమనించారు. రాముని పేరు మీద ,అక్షింతలు పేరు మీద ఓట్లు అడుక్కునే -మిగతా 2 లో



# అగ్నివీరుల రిటెన్షన్ పరిమితి పెంపు!

- 25% నుంచి 50--75% రిటెన్షన్‌కు ప్రతిపాదన
- అగ్నివీరుల కొనసాగింపునకు దళాల మొగ్గు
- శాశ్వత నియామకాల పెంపుపై సమీక్ష
- డీఎంఏతో ప్రతిపాదనలపై చర్చలు
- తొలి బ్యాచ్‌కు ఏడాది చివర్లో సేవల ముగింపు

న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ డైరీ)

నాలుగేండ్ల సర్వీస్ ముగిసిన తర్వాత కూడా అగ్నివీర్లను పెద్ద సంఖ్యలో కొనసాగించాలని త్రివిధ దళాలు కోరుతున్నాయి. 'అగ్నిపథ్ పథకం'లో ఎంపికైన అగ్నివీర్లను కొనసాగించే అంశంపై భారత సైన్యం కీలక సమీక్ష చేపట్టింది. ప్రస్తుతమున్న 25 శాతం రిటెన్షన్ పరిమితిని 50శాతానికి పెంచాలని ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ కోరుతుండగా, రిటెన్షన్‌ను 75శాతానికి పెంచాలని నౌకాదళం భావిస్తున్నది. ఇందుకు సంబంధించి త్రివిధ దళాలు వేర్వేరుగా తమ ప్రతిపాదనలు సిద్ధం చేయగా, దీనిపై సాధ్యాసాధ్యాల కోసం సాయుధ దళాల్లోని విభాగాలు, మిలిటరీ వ్యవహారాల శాఖ (డీఎంకే) మధ్య మరింత చర్చ జరిగే అవకాశముంది. శిక్షణ పొందిన సిబ్బందిలో ఎక్కువమందిని -మిగతా 2 లో



# ఆగస్టు 6న భారీ బహిరంగ సభ


- బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకే
- "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో ఏర్పాటు
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ (జర్నలిస్ట్ డైరీ))

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6న హైదరాబాద్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్ లోని బీఆర్ఎస్ ఆఫీస్ లో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం సంకల్పం తీసుకుంటామని తెలిపారు. "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బీసీలతో పాటు -మిగతా 2 లో

# మణిపూర్‌లో ఉగ్రదాడి..

-అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు వీరమరణం
-నుంగ్సాంగ్ కాంగ్ ప్రాంతంలో బాంబు దాడులు, కాల్పులు
-రెండు గంటలపాటు కొనసాగిన తీవ్ర కాల్పులు, పేలుళ్లు
-షాంగ్‌షాక్ బెటాలియన్ సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు సమాచారం



**న్యూఢిల్లీ,**
మణిపూర్‌లో ఉగ్రవాదులు మెరుపుదాడికి పాల్పడ్డారు. సోమవారం ఉఖ్రుల్ జిల్లాలో సాయుధులైన ఉగ్రవాదులు బాంబు దాడులు, కాల్పులకు దిగటంతో..అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. నుంగ్సాంగ్ కాంగ్ ప్రాంతంలో ఈ దాడి జరిగిందని, పలువురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారని వార్తలు వెలువడ్డాయి.ఘటనాస్థలంలో దాదాపు రెండు గంటలపాటు తీవ్రమైన కాల్పులు, వరుస పేలుళ్లు కొనసాగాయని స్థానికులు తెలిపారు. ఇరు వర్గాల మధ్య భారీగా కాల్పులు జరుగడం స్థానిక ప్రజల్లో భయాందోళనలు రేపింది. 40 అస్సాం రైఫిల్స్‌కు చెందిన షాంగ్‌షాక్ బెటాలియన్ సిబ్బంది జిల్లా ప్రధాన కార్యాలయానికి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# పీవోకేలో ఉద్యమం ఉధృతం..

(మొదటి తరువాయి)
విజ్ఞప్తి చేస్తూ జూన్ 9 నాటి లాంగ్‌మార్చ్‌లో చూపిన పట్టుదలను మళ్లీ ప్రదర్శించాలని, తమ కుటుంబాలతో కలిసి మరోసారి పూంచ్ వైపు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కమిటీ కోరింది. పోలీసుల కాల్పులు జరిగినప్పటికీ రాష్ట్ర బలగాలను ఎదిరించి, నిర్బంధించిన తమ సోదరులను విడిపించుకొని ఇటీవల చరిత్ర సృష్టించిన మీర్‌పూర్ డివిజన్ మహిళల ధైర్యాన్ని కొనియాడింది.

# మాకు భారత్ ఉంది.

(మొదటి తరువాయి)
ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు ఇజ్రాయెల్‌కు తమ మద్దతు తెలుపుతున్నారని నెతన్యాహు పేర్కొన్నారు. గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌తో జరిపిన దౌత్యపరమైన చర్చలను ఇజ్రాయెల్ నేతలు వ్యతిరేకించడాన్ని జేడీ వాన్స్ తప్పుబడుతూ, ఒకవేళ తానే గనుక ఇజ్రాయెల్ క్యాబినెట్‌లో ఉంటే, ప్రపంచంలో తనకు మిగిలిన ఏకైక శక్తివంతమైన మిత్రదేశంపై దాడి చేసేవాడిని కాదంటూ వ్యాఖ్యానించారు.

# దక్షిణ పసిఫిక్‌లో బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన చైనా



బీజింగ్
పసిఫిక్ మహాసముద్రంలో నిర్దేశిత జలాలలో ఉన్న అణు జలాంతర్గామి నుంచి చైనా ఓ క్షిపణిని పరీక్షించింది. దక్షిణ పసిఫిక్‌లో సోమవారం మధ్యాహ్నం 12.01 గంటలకు చైనా నౌకాదళం అణుశక్తితో నడిచే జలాంతర్గామి నుంచి దూర శ్రేణి బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిందని సిన్హువా వార్తా సంస్థ తెలియ జేసింది. అయితే ఈ పరీక్ష వార్షిక సైనిక శిక్షణలో భాగంగానే జరిగిందని, అంతే తప్ప ఏ నిర్దిష్ట లక్ష్యాన్నీ ఉద్దేశించి చేసింది కాదని వివరించింది. పసిఫిక్ మహాసముద్రంలో క్షిపణి పరీక్ష నిర్వహించే ప్రణాళిక గురించి చైనా తనకు ముందుగానే సమాచారం ఇచ్చిందని ఆస్ట్రేలియా చెప్పింది. కాగా చైనా క్షిపణి పరీక్షపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ విమర్శలు కురిపించాయి.

# గాజాలో హమాస్ పాలన ముగింపు

-పౌర పాలనకు మార్గం సుగమం




**న్యూఢిల్లీ**
యుద్ధంతో అతలాకుతలమైన గాజాలో తన 20 ఏండ్ల పాలనకు ముగింపు పలుకుతూ హమాస్ సోమవారం తన అత్యవసర పాలక మండలిని రద్దు చేసింది. 2007లో గాజాలో హమాస్ పాలన మొదలైంది. హమాస్ తాజా చర్యతో గాజా ప్రాంతంలో పౌర పాలనను అమలు చేయడానికి ఏర్పాటైన గాజా జాతీయ పరిపాలనా కమిటీ(ఎన్‌సీఏజీ)కి మార్గం సుగమం చేస్తున్నది. ఎన్‌సీఏపీ పర్యవేక్షణ బాధ్యతను బోర్డ్ ఆఫ్ పీస్(బీవోపీ) నిర్వహిస్తుంది. ఇది అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వంలోని ఒక అంతర్జాతీయ కూటమి.గాజాలో రోజువారీ పరిపాలన నుంచి తాము వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్లు తీవ్రవాద గ్రూపు హమాస్ ఇదివరకే ప్రకటించింది. నిరాయుధీకరణ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. జాతీయ కమిటీ తన బాధ్యతలను స్వీకరించే వరకు ఆ కమిటీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు జాతీయ స్థాయిలో ఆమోదయోగ్యమైన వ్యక్తిని నియమించాలని హమాస్ నిర్ణయించినట్లు ఆ గ్రూపు ప్రతినిధిని ఉటంకిస్తూ ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది.

# కేసీఆర్ అసెంబ్లీకి రావాలి


(మొదటి తరువాయి)
ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది మీరే... కులింది మీ హయాంలోనే .. ఇప్పుడు మళ్లీ అక్కడికి వెళ్లి గొప్పలు చెప్పుకోవడం కూడా మీరే. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధమేంటి?” అని ప్రశ్నించారు. ప్రతి పేదవాడి చెమటోడ్చి చెల్లించిన పన్నుల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేక కుంగిపోతే, దానికి బాధ్యత వహించాల్సింది బీఆర్ఎస్ నాయకత్వమేనని అన్నారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహక ప్రాంతాలకు తరలించే పేరుతో నిర్మించిన ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఎన్ని నిరాధార ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని తిరస్కరిస్తూనే ఉన్నారని, అధికార దాహంతో చేస్తున్న రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతున్నారని అన్నారు. నిజంగా ప్రజాహితం కోసం సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదిక సిద్ధంగా ఉందని, అక్కడే అన్ని అంశాలపై బహిరంగంగా చర్చిద్దామని కేసీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇప్పటికీ 32 వేల కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తున్నాయని ప్రభుత్వం గుర్తించిందని, రెండో విడత నుంచి నాలుగో విడత వరకు వారికి అత్యంత ప్రాధాన్యంతో



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్దిపేటతో పాటు కొద్ది ప్రాంతాల్లో మాత్రమే ఇళ్లు నిర్మించి, మిగిలిన నియోజకవర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నిర్మించిన ఇళ్లను కూడా అసంపూర్తిగా వదిలేసిందని అన్నారు. గత పదేళ్లలో ప్రతి ఏడాది లక్ష ఇళ్లు నిర్మించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం మెదక్, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నామని, మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఆడబిడ్డల పేరుతో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 70 నుంచి 75 వేల ఇళ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.
మొదటి విడత విజయవంతం కావడంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారని, ఈ విడతలో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గంలో రెండు వేల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇందులో 1,500 కొత్త ఇళ్లతో పాటు గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 500 రేకుల ఇళ్లు, మొండిగోడల ఇళ్ల పూర్తి కోసం కూడా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# మహారాష్ట్రలో.. జల ప్రళయం

- వారం రోజులుగా ఎడతెగని వానలు
- పుణే జిల్లాలో విరిగిపడిన కొండచరియలు
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- శిథిలాల్లో చిక్కుకున్న మరో 30 మంది
- ముంబైలో వర్ష సంబంధిత ఘటనల్లో 8 మంది మృతి
- ముంబైపుణే ఎక్స్‌ప్రెస్‌వే, హైవేపై పూర్తిగా నిలిచిపోయిన రాకపోకలు
- ముంబై సహా పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ



**ముంబై,**
మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు పెను విషాదాన్ని సృష్టించాయి. పుణే జిల్లాలో సోమవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో పలు ఇళ్లు శిథిలాల కింద కూరుకుపోయాయి. ఈ ఘోర దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరోవైపు, ఈ విపత్తు కారణంగా ముంబైపుణే మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. భారీ వర్షాల నేపథ్యంలో ముంబై నగరానికి భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. విరిగిపడిన కొండ చరియలు పుణే జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలోని పటాన్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున 4:25 గంటల సమయంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో సుమారు ఐదు ఇళ్లు శిథిలాల కింద సమాధి అయ్యాయి. ప్రమాద సమయంలో నిద్రలో ఉన్న నందు టికోసే (60), మౌళి టికోసే (30), అనితా టికోసే (55) అనే ముగ్గురు కుటుంబ సభ్యులు మరణించారు. 30 నుంచి 35 మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తుండగా, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా గ్రామంలో మూ డు వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయని, ఒక ఘటనలో ఇల్లు కూలి ముగ్గురు మరణించారని డీఎస్పీ గజానన్ టోంపే తెలిపారు. స్తంభించిన రవాణా కొండచరియలు విరిగిపడటంతో ముంబైపుణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబైపుణే హైవేపై వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ మార్గాల్లో ప్రయాణించవద్దని ప్రజలకు సూచించారు. ప్రతికూల వాతావరణ దృష్ట్యా అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. రెండు నెలల క్రితమే ప్రారంభమైన 13 కిలోమీటర్ల ముంబైపుణే మిస్సింగ్ లింక్ మార్గంలో కూడా రాకపోకలు ప్రభావితమయ్యాయి.
ముంబైలో జనజీవనం అస్తవ్యస్తం.. మరోవైపు, భారీ వర్షాలతో ముంబై నగరం అతలాకుతలమవుతోంది. ముంబై, థానే, రాయ్‌గఢ్ జిల్లాలకు ఐఎండీ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. అత్యంత భారీ వర్షాలు, గంటకు 6070 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించింది. బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కూడా హెచ్చరికలు జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# పర్యాటక రంగం ప్రక్షాళనకు శ్రీకారం

(మొదటి తరువాయి)
అభివృద్ధి చేయాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్ మెంట్ పథకం కింద వికారాబాద్ ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, అక్కడి వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీ శాఖ పరిధిలోని భూములను పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని ఎకో టూరిజం ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు.గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను ఏర్పాటు చేయాలని, ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ప్రత్యేక ప్రాజెక్టులను చేపట్టి, వాటి అమలును వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్ నగర చారిత్రక వారసత్వాన్ని పర్యాటక రంగానికి అనుసంధానం చేసే దిశగా పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ఈ వంతెనపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే ట్రాఫిక్ ను మళ్లించి పర్యాటక కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది డిసెంబర్ లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ కు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. సమ్మిట్ విజయవంతం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.

## దేవుడి పేరుతో రాజకీయమా?

(మొదటి తరువాయి)
వీళ్ళకు అయోధ్య లో ఓడగొట్టారు.
దీనిపై బీజేపీ స్పందించాలి..దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి..దేవుని పేరు మీద అక్షింతలు పేరు తో రాజకీయానికి వాడుకున్నారు.. పెద్ద ఎత్తున డబ్బులు దొంగతనం చేసి అవినీతికి పాల్పడ్డారు. తెలంగాణ బీజేపీ నేతలు స్పందించాలి.. అయోధ్య ట్రస్ట్ ప్రధాని మోడీ, అమిత్ షా,ముఖ్యమంత్రి కి సన్నిహితులు వారు ఎందుకు స్పందించడం లేదు. హుండీ లు కొల్లగొట్టారు..రాముని పేరు మీద దేశ వ్యాప్తంగా వసూలు చేసిన చందాలు ఎత్తుకొని పోయారు. ఇక్కడ ప్రతి ఊర్లో అక్షింతలు పంచి ఓట్లు అడిగారు.. మీకు రామునికి వ్యతిరేకం కాదు.
మేము శ్రీరాముడి కళ్యాణం లో పాల్గొంటాం..ఇల్లంతకుంట రామాలయంలో నేను ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన భోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుంది. రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి...భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసే వారు మాట్లాడాలి. అక్కడ జరిగిన దానిపై పొరపాటు అని దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి. రామ జన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్ములు దొంగిలించడంపై హిందువులు అందరికీ అవమానం. దేవుడి పేరు మీద జరిగిన స్కాం.. దేవుడి స్కాం కి వాడుకున్న పార్టీ బీజేపీ ,మల్లేష్ పేరు తీయండి కిషన్ రెడ్డి బతకడు..కిషన్ రెడ్డి గెలవాలంటే మల్లేష్ ను తిట్టాలి ఇది వారి రాజకీయాలు. రాష్ట్రంలో ఓటరు సవరణ ప్రక్రియ జరుగుతుంది. ఓటరు సవరణ ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైంది. ప్రతి ఇంటింటా ఎన్యూమరేషన్ ఫారాలు చేరాయి..బీఎల్ఎ, బీఎల్వో లతో సమన్వయం చేసుకుంటూ అర్హత కలిగిన ఒక ఓటు కూడా మిస్ కాకుండా చూడాలి. నేను స్వయంగా ఏడు మండలాలు ప్రత్యక్షంగా తిరిగాను..మా పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చాం. హైదరాబాద్ ,సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో సర్ పై ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగింది. ఓటరు సవరణ ప్రక్రియ విజయవంతంగా జరగాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు.

## ఆగస్టు 6న భారీ బహిరంగ సభ

(మొదటి తరువాయి)
సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామన్నారు. ముందు భౌగోళిక తెలంగాణ సాధించుకున్నాం.. ఆ తర్వాత సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం పాటు పడుదామన్న ప్రొఫెసర్ జయశంకర్ గారి సూచనల మేరకు తాము 50 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పాటు పడుతున్నామని తెలిపారు తాము చేసిన ఉద్యమాలకు తలొగ్గి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీ, కౌన్సిల్ లో పాస్ చేసి కేంద్రానికి పంపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదన్నారు. “మనమెంతో మనకంత” అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలను కలుపుకొని 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు.

## అగ్నివీరుల రిటెన్షన్ పరిమితి పెంపు!

(మొదటి తరువాయి)
కొనసాగించటం ద్వారా ఆధునిక వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం, కొత్త తరహా యుద్ధ వ్యూహాలపై అనుభవం ఉన్న సైనికుల సంఖ్యను పెంచుకోవచ్చునని త్రివిధ దళాలు భావిస్తున్నాయి. 2023లో శిక్షణ ప్రారంభించిన తొలి బ్యాచ్ అగ్నివీరులు ఈ ఏడాది చివరలో తమ నాలుగేండ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకోనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం, అగ్నివీరులలో ప్రతి బ్యాచ్‌లో కేవలం 25శాతం మందిని మాత్రమే శాశ్వత సర్వీస్‌కు ఎంపికచేస్తారు. ప్రతిభ, వైద్య అర్హతలు, సంస్థాగత అవసరాల ఆధారంగా ఈ ఎంపిక ఉంటు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఉగ్రం రైఫిల్‌కు ఆర్మీ, హోంశాఖ క్లియరెన్స్.

**- హైదరాబాదీ స్టార్టప్ కంపెనీ ఘనత**




**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
హైదరాబాద్‌కు చెందిన ద్విపా డిఫెన్స్ స్టార్టప్ కంపెనీ రూపొందించిన ఉగ్రం-యూ51 రైఫిల్‌కు ఆర్మీ, కేంద్ర హోంశాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ట్రయల్స్‌లో ఆ రైఫిల్ సక్సెస్ అయినట్లు కేంద్ర వర్గాలు తెలిపాయి. 7.62ఐ51 ఎంఎం క్యాలిబర్‌కు చెందిన యుద్ధ రైఫిల్‌ను కొనుగోలు చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలు ఆసక్తిగా ఉన్నట్లు తెలిసింది. డీఆర్డీవోకు చెందిన ఆర్మామెంట్ రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కలిసి ద్విపా స్టార్టప్ కంపెనీ ఉగ్రం రైఫిల్‌ను సంయుక్తంగా డెవలప్ చేశారు. కేవలం 100 రోజుల్లోనే ఈ రైఫిల్‌ను డిజైన్ చేసి, డెవలప్ చేసినట్లు తెలిసింది. చాలా వేగంగా అభివృద్ధి చేసిన స్వదేశీ రైఫిల్‌గా గుర్తింపు పొందింది. ఆర్మీ జనరల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్‌తో పాటు కేంద్ర హోంశాఖ నిర్వహించిన ట్రయల్స్‌లో ఉగ్రం రైఫిల్‌కు క్లియరెన్స్ దక్కింది.ద్విపా డిఫెన్స్ కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ మాట్లాడుతూ.. తమ కంపెనీకి 2021లో తయారీ లైసెన్సు వచ్చిందని, తెలంగాణ సర్కారు అందజేసిన 13 ఎకరాల భూమిలో పూర్తి స్థాయి ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం తమ కంపెనీలో సుమారు వంద స్వదేశీ ఆయుధ వ్యవస్థలను తయారు చేశామని, ఇక ఉగ్రం రైఫిల్ తమ కీలక ఉత్పత్తిగా మారిందన్నారు. విస్తృత స్థాయిలో ఉగ్రం రైఫిల్‌కు చెందిన రియలబులిటీ, ఎండ్యూరెన్స్ పరీక్షలు జరిగాయని, ఈ రైఫిల్‌ను ప్రొక్యూర్ చేసుకునేందుకు సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ, ఎన్ఎస్జీ ఆసక్తిగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఉగ్రం రైఫిల్‌లో ఆధునిక గ్యాస్ ఆపరేటింగ్ బోల్ట్ సిస్టమ్ ఉన్నది. 4 కేజీల కన్నా తక్కువ బరువు ఉంటుంది. 500 మీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను సమర్థవంతంగా ఛేదిస్తుంది. ద్విపా డిఫెన్స్ కంపెనీలో అసాల్ట్ రైఫిల్లు, కార్బైన్లు, సబ్ మెషీన్ గన్నులు, లైట్ మెషీన్ గన్నులు, యాంటీ డ్రోన్ సిస్టమ్స్ తయారవుతున్నాయి.

# మణిపూర్‌లో మిలిటెంట్ల మెరుపుదాడి..


**-ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మృతి**



**ఇంఫాల్, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
జవాన్ల కాన్వాయ్‌పై మిలిటెంట్లు మెరుపుదాడి చేశారు. ఈ సంఘటనలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నుంగ్‌షాంగ్ ఖోంగ్ ప్రాంతంలో 40 అస్సాం రైఫిల్స్‌కు చెందిన కాన్వాయ్‌పై మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణించారు. మరికొందరు జవాన్లు గాయపడ్డారు. వెంటనే ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలించారు. దాడి చేసిన అనుమానిత మిలిటెంట్ల కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.కాగా, ఉఖ్రుల్ జిల్లాలోని లంబూయి గ్రామంలో మోహరించిన సుమారు 40 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బంది న్యూ హెవెన్‌లో ఒక అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. అయితే స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపకుండా అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. ఆదివారం మహిళలు, విద్యార్థి సంఘాలతో సహా స్థానికులు నిరసన తెలిపారు. అవుట్‌పోస్ట్ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిరసన చేస్తున్న జన సమూహాన్ని నియంత్రించేందుకు అస్సాం రైఫిల్స్ సిబ్బంది లాఠీచార్జ్‌తో పాటు పలు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా నలుగురు గ్రామస్తులు గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాత మిలిమెంట్ల మెరుపుదాడి చేయడంతో ఇద్దరు అస్సాం రైఫిల్స్ జవాన్లు మరణించగా పలువురు గాయపడ్డారు.

# రావణ కాష్టంలా శ్రీలంక జైలు..

**-25 మంది మృతి,**
**100 మందికి గాయాలు**




**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
రెండు గ్రూపుల మధ్య తలెత్తిన వివాదం శ్రీలంక జైలును రావణకాష్టంలా మార్చిం ది. పరస్పర దాడుతో జైలు పరిసరాలు యుద్ధభూమిని తలపించాయి. శ్రీలంకలోని ఓ జైలులో జరిగిన ఘర్షణ ల్లో నలుగురు గార్డులతో సహా 23 మంది మరణించగా 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన దేశ రాజధాని కొలంబోకు ఉత్తరాన ఉన్న నెగొంబోలోని ప్రధాన జైలులో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు వెల్లడించిన విరాలు ఇలా ఉన్నాయి.వేలాది మంది ఖైదీలు ఉన్న నెగొంబో జైలులో ఆదివారం సాయంత్రం రెండు డ్రగ్ ముఠాలకు చెందిన ఖైదీల మధ్య గొడవ ప్రారంభమై భౌతిక దాడులకు దిగారని తెలిపారు. జైలు సిబ్బంది క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో కొందరికి తుపాకీ గుండు గాయాలు కాగా, మరికొందరికి తీవ్రమైన దెబ్బలు తగిలాలయని హాస్పిటల్ డైరెక్టర్ పుష్ప గమ్లత్ తెలిపారు. కాగా, ఘర్షణలు జరుగుతున్న తరుణంలో పక్కనే విభాగంలో ఉన్న మహిళా ఖైదీలు అదే రాత్రి భయంతో జైలు పైకప్పుపైకి ఎక్కి తమను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం శ్రీలంక ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసు కమాండోలను రంగంలోకి దించింది. జైలు ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి వైమానిక దళం డ్రోన్‌లు, హెలికాప్టర్‌ను మోహరించారు. విషయం తెలుసుకున్న ఖైదీల బంధువులు పెద్ద సంఖ్యలో జైలు బయట గుమిగూడారు. గత ఐదేళ్లకు పైగా కాలంలో దేశంలో జరిగిన అత్యంత ఘోరమైన జైలు అల్లర్లు ఇవేనని స్థానిక అధికారులు తెలిపారు.

# పశ్చిమ బెంగాల్‌లో రాజ్యసభ ఉప ఎన్నికలు..



**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డ సంగతి తెలిసిందే. ఎంపీలు సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్, ప్రకాష్ చిక్ బారైక్ రాజీనామాలతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. భారత ఎన్నికల సంఘం ఈ మూడు రాజ్యసభ స్థానాలకు సంబంధించి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. జులై 24వ తేదీన మూడు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. జులై 7వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నామినేషన్ల సమర్పణకు జులై 14 ఆఖరి తేదీ అని పేర్కొంది.

## ఆరు కిలోల బరువు తగ్గిన సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తు కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో చేపట్టిన నిరసనలు సోమవారం 17వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష 9వ రోజుకు చేరుకుంది. దీంతో ఇప్పటిదాకా ఆయన ఆరు కిలోల బరువు తగ్గారు. వాంగ్‌చుక్ రక్తపోటు 112/70కు, హృదయ స్పందన నిమిషానికి 72, బ్లడ్ షుగర్ స్థాయి 67గా నమోదైందని ఆరోగ్య బులెటిన్ పేర్కొంది. నీట్ పేపర్ లీకేజీతో తీవ్ర ఆందోళనతో రియా కుమారి థాపా ఆత్మహత్య చేసుకుందని, ఆర్మీ రిటైర్డు ఉద్యోగి ఆమె తండ్రి ఆదివారం నిరసనలో పాలుపంచుకున్నారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. తమ ఆవేదన మరే కుటుంబానికి రాకూడదని ఆయన కోరుకుంటున్నారని, కేంద్రమే దీనిపై భరోసా ఇవ్వాలని ఈ సందర్భంగా దీప్కే పేర్కొన్నారు.

# టికెట్‌లో వయసు తప్పు..

**- రూ.7,035 జరిమానా చెల్లించిన ప్రయాణికుడు**



**నాగపూర్: (జర్నలిస్టు డైరీ) జూలై 6**
బెంగుళూరు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడు నాగ్‌పూర్ వరకు వెళ్లాడు. అయితే అతని టికెట్ పై వయసు కేవలం ఒక్క ఏడాది మాత్రమే ప్రింట్ అయి ఉన్నది. ఏడాది వయసున్న టికెట్‌తో ఆ ప్రయాణికుడు జర్నీ చేశాడు. జూన్ 23వ తేదీన 22691 నెంబర్ రైలులో ఈ ఘటన జరిగింది. టికెట్ చెకింగ్ సమయంలో రైల్వే టీసీ ఆ ప్రయాణికుడికి ఫైన్ వేశాడు. ఏడాది వయసు ఉన్నట్లుగా ఉన్న టికెట్‌తో 24 ఏళ్ల వ్యక్తి ప్రయాణించాడు. అతని పేరు రమాకాంత్. అయితే టీటీఈ వెరిఫికేషన్ సమయంలో ఈ-టికెట్‌పై 24కు బదులుగా 1 సంఖ్య ఉన్నది. డాటా ఎంట్రీలో పొరపాటు వల్ల టికెట్‌పై ఏడాది వయసు మాత్రమే ఉన్నట్లు తప్పుగా పడిందని ఆ ప్రయాణికుడు చెప్పాడు.తన ఐడెంటిటీ కార్డును చూపించినా.. టీటీఈ మాత్రం అతనికి ఫైన్ వేశాడు. ప్రయాణికుడి వివరాలు సరిగ్గా లేవని జరిమానా విధించారు. దీంతో అతనికి 7035 ఫైన్ వేశారు. యూపీఐ ద్వారా రమాకాంత్ ఫైన్ చెల్లించాడు. నాగపూర్‌లో ట్రైన్ దిగిన తర్వాత అతను రైల్‌మదద్ సాయంతో ఫిర్యాదు నమోదు చేశాడు. కానీ ఒక్క రోజులోనే రైల్వే శాఖ తీర్పు ఇచ్చింది. టీటీవీ విధించిన జరిమానాను రైల్వే శాఖ సమర్థించింది. నియమావళి ప్రకారమే టీటీఈ ఫైన్ వసూల్ చేసినట్లు రైల్వే శాఖ చెప్పింది. వాస్తవానికి ప్రయాణికులు తమ టికెట్‌ను చెక్ చేసుకోవాలని, ఒకవేళ తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, ప్రయాణానికి ముందు వివరాలను మార్చుకోలేదని, సరైన టికెట్ లేని కారణంగా, 1989 రైల్వే చట్టంలోని సెక్షన్ 138 ప్రకారం ఆ ప్రయాణికుడికి జరిమానా వేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఏడాది వయసున్న ప్యాసింజెర్‌కు ఎలా టికెట్ ఇచ్చారన్న అంశాన్ని పరిశీలిస్తున్నామని సౌత్ వెస్ట్రన్ రైల్వే అధికారి మంజునాథ్ తెలిపారు. రిజర్వేషన్ టికెట్‌పై వయసు ఏడాది మాత్రమే ఉన్నప్పుడు, ఎలా ఆ టికెట్‌ను బుకింగ్ సిస్టమ్ ఆమోదించిందన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

# 600 డ్రోన్లతో ఉక్రెయిన్ అటాక్..

**తిప్పికొట్టిన రష్యా**



**మాస్కో: (జర్నలిస్టు డైరీ) జూలై 6**
ఉక్రెయిన్ విస్తృత స్థాయిలో రష్యాపై డ్రోన్ దాడి చేసింది. సుమారు 600 డ్రోన్లతో అటాక్ చేసినట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొన్నది. అయితే తమ వైమానిక రక్షణ దళం ఆ డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కోలోని రష్యా రక్షణ శాఖ పేర్కొన్నది. సుమారు 20 ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో ఆ డ్రోన్లను నేలకూల్చినట్లు రష్యా వెల్లడించింది. మాస్కో, లెనిన్‌గ్రాడ్, క్రస్నోడార్, బెల్‌గోరోడ్, సమరా, వోల్గోగ్రాడ్ , క్రిమియా, అజోవ్ సముద్రంపై ఆ అటాక్ జరిగింది. మాస్కో మీదకు వచ్చిన సుమారు 11 యూఏవీలను కూల్చివేసినట్లు ఆ నగర మేయర్ సెర్గీ సోబియానియన్ తెలిపారు.డ్రోన్ల దాడి వల్ల క్రిమియాలో బ్లాకౌట్ ఏర్పడింది. స్థానిక ఎలక్ట్రిక్ గ్రిడ్ ఆపరేటర్ దెబ్బతిన్నది. హై వోల్టేజ్ నెట్వర్క్‌ను టార్గెట్ చేయడం వల్ల అన్ని నగరాలు, జిల్లాలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సుదీర్ఘ దూరం ప్రయాణించే యూఏవీలతో ఇంధన కేంద్రాలను కీవ్ టార్గెట్ చేసినట్లు రష్యా చెప్పింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడి వల్ల.. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న పోర్టు దెబ్బతిన్నది. అక్కడున్న ఆయిల్ కంపెనీ నుంచి నల్లటి పొగ వ్యాపిస్తున్నది. సమీపంలో ఉన్న మిలిటరీ టార్గెట్లను కూడా ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ చెప్పింది. రాజధాని మాస్కోపైనే సుమారు 200 డ్రోన్లతో దాడి జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. రష్యాలో చాలా సుదూర ప్రాంతాల్లో ఉన్న ఆయిల్ కంపెనీ కేంద్రాలపై కూడా ఉక్రెయిన్ దాడి చేయడం గమనార్హం. ఉక్రెయిన్ తాజా డ్రోన్ దాడులతో.. రష్యాలో కొత్త తరహా యుద్ధం మొదలైంది. మీడియం రేంజ్ డ్రోన్లతో రష్యా లాజిస్టిక్స్‌ను ఉక్రెయిన్ క్రమంగా టార్గెట్ చేస్తోంది. క్రిమియాలో ఇంధన కొరత ఏర్పడడంతో ఎమర్జెన్సీ ప్రకటించారు.

# పుణెలో ఇంటిపై విరిగిపడిన కొండ చరియలు..

**-ఒకరి మృతి, ఇద్దరు గల్లంతు**



**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనానని అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా పుణె జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. మావల్ తాలూకాలోని పటాన్ గ్రామంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్న ఇద్దరిని గుర్తించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో కర్జత్-లోనావాలా ఘాట్ సెక్షన్‌లో కొండచరియలు విరిగిపడటంతో ముంబై-పూణేల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.16 రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారి మళ్లించారు. భద్రతా కారణాల దృష్ట్యా ముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబై-పూణే హైవేపై రాకపోకలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. అత్యసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

# పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

**కేంద్రం కీలక ప్రతిపాదన**




**న్యూఢిల్లీ, (జర్నలిస్టు డైరీ) జూలై 6**
రోడ్డు భద్రతా నిబంధనలను మరింత పటిష్టం చేసి పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడాన్ని నిరోధించడానికి మోటారు వాహనాల చట్ట నిబంధనల్లో భారీ సవరణలకు కేంద్రం యోచిస్తున్నది. రాష్ట్రాలతో దాదాపు రెండేళ్లపాటు సంప్రదింపులు జరిపి మంత్రుల బృందం నుంచి ఆమోదం పొందిన తర్వాత తీసుకురావలసిన మార్పుల కోసం కేంద్ర రోడ్డురవాణా, హైవేల మంత్రిత్వశాఖ ఒక ప్రతిపాదనను రూపొందించింది. పదేపదే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేయడం కీలక ప్రతిపాదనల్లో ఒకటి. సస్పెండ్ అయిన లైసెన్సును పునరుద్ధరించుకోవడానికి వాహనదారులు ప్రభుత్వ అధీకృత డ్రైవింగ్ పరీక్షా కేంద్రంలో మళ్లీ డ్రైవింగ్ పరీక్ష రాయవలసి ఉంటుందిరక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఇటీవల జరిగిన మంత్రుల బృందం సమావేశంలో ప్రతిపాదిత సవరణలకు ఆమోదం లభించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పదేపదే నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలకు సంబంధించి వాహన్ పోర్టల్‌లో వాహన ఫిట్‌నెస్, కాలుష్య ధృవీకరణ పత్రం పునరుద్ధరణ వంటి సేవలను తాత్కాలికంగా పరిమితం చేయాలని కూడా మంత్రిత్వశాఖ ప్రతిపాదిస్తున్నది. అజాగ్రత్తగా వాహనాలు నడపడం, బీమా లేని వాహనాలను ఉపయోగించడంపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం భావిస్తోంది

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# అమెరికా చరిత్రలో విజయాల వెలుగులు-సవాళ్ల నీడలు



1776 జూలై 4న స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన అమెరికా 250 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ప్రపంచ చరిత్రలో ఇంత తక్కువ కాలంలో ఒక దేశం రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా, శాస్త్ర, సాంకేతికంగా ఇంతటి అగ్రస్థానానికి చేరుకోవడం అరుదైన ఘట్టం. కేవలం పదమూడు బ్రిటిష్ కాలనీల సమాఖ్యగా ప్రారంభమైన అమెరికా, నేడు ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక పరిణామాలు, భద్రతా విధానాలను ప్రభావితం చేసే అగ్రరాజ్యంగా నిలిచింది. అయితే ఈ 250 ఏళ్ల ప్రయాణం కేవలం విజయగాథ మాత్రమే కాదు; ఎన్నో విజయాలతో పాటు తీవ్రమైన వైఫల్యాలు, అంతర్గత వైరుధ్యాలు, ప్రపంచవ్యాప్తంగా వివాదాలకు కారణమైన నిర్ణయాల చరిత్ర కూడా.అమెరికా బలం దాని భౌగోళిక విస్తీర్ణంలో లేదు; అది నిర్మించుకున్న వ్యవస్థలో ఉంది. వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అధికారాల విభజన, స్వతంత్ర న్యాయవ్యవస్థ, రాజ్యాంగబద్ధ పాలన వంటి విలువలను దేశ నిర్మాణానికి పునాదిగా చేసుకుంది. ఈ వ్యవస్థే ఎన్నో సంక్షోభాలను తట్టుకుని నిలబడే శక్తిని అమెరికాకు ఇచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలకు ఆ దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విధానాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.అయితే స్వేచ్ఛను ప్రపంచానికి బోధించిన ఈ దేశ చరిత్రలోనే బానిస వ్యవస్థ ఒక మాయని మచ్చగా నిలిచిపోయింది.

నల్లజాతీయులను బానిసలుగా ఉపయోగించడం, అంతర్యుద్ధం వరకు దారితీసిన జాతి విభేదాలు, తరువాత కూడా దశాబ్దాల పాటు కొనసాగిన వివక్ష అమెరికా ప్రజాస్వామ్య ఆదర్శాలను ప్రశ్నించాయి. పౌరహక్కుల ఉద్యమం ద్వారా చట్టపరమైన సమానత్వం సాధించినప్పటికీ, జాతి వివక్ష పూర్తిగా అంతరించిపోలేదని నేటికీ చోటుచేసుకుంటున్న సంఘటనలు గుర్తు చేస్తున్నాయి.ఆర్థిక రంగంలో అమెరికా సాధించిన పురోగతి అసాధారణం. పారిశ్రామిక విప్లవం నుంచి డిజిటల్ యుగం వరకు ప్రతి దశలో కొత్త ఆవిష్కరణలకు నాయకత్వం వహించింది. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక కంపెనీలు, ఆర్థిక మార్కెట్లు అమెరికాను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా నిలబెట్టాయి. డాలర్ ప్రపంచ ప్రధాన నిల్వ కరెన్సీగా మారడం, ఆవిష్కరణలకు పెట్టుబడులు సమకూర్చే వ్యవస్థ ఏర్పడడం, ప్రపంచ నలుమూలల నుంచి ప్రతిభను ఆకర్షించడం దాని ఎదుగుదలకు ప్రధాన కారణాలు.శాస్త్రసాంకేతిక రంగంలో అమెరికా చేసిన కృషి మానవ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించింది. చంద్రుడిపై మానవుడిని నిలబెట్టిన దేశంగా, ఇంటర్నెట్ విప్లవానికి మార్గదర్శిగా, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధనలు, వైద్య విజ్ఞానంలో కీలక ఆవిష్కరణలకు కేంద్రంగా అమెరికా నిలిచింది. ఆధునిక ప్రపంచ జీవనశైలిని ప్రభావితం చేసిన అనేక సాంకేతిక విప్లవాలు అక్కడి నుంచే ప్రారంభమయ్యాయి.

అంతర్జాతీయ రాజకీయాల్లో కూడా అమెరికా ప్రభావం అనన్యసామాన్యం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ వ్యవస్థ రూపకల్పనలో అది ప్రధాన పాత్ర పోషించింది. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల ద్వారా ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేసింది. ప్రచ్ఛన్న యుద్ధంలో సోవియట్ యూనియన్‌తో పోటీ పడుతూ చివరకు ఏకైక అగ్రరాజ్యంగా అవతరించింది.

కానీ అదే సమయంలో అమెరికా విదేశాంగ విధానం ఎన్నో ప్రశ్నలకు కూడా తావిచ్చింది. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధాలు, వివిధ దేశాల్లో రాజకీయ జోక్యాలు, వ్యూహాత్మక ప్రయోజనాల పేరిట తీసుకున్న నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురయ్యాయి. ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తామని చెప్పిన అమెరికా, కొన్ని సందర్భాల్లో తన ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించిందనే అభిప్రాయం బలపడింది. ఈ ద్వంద్వ వైఖరి దాని అంతర్జాతీయ ప్రతిష్ఠపై ప్రభావం చూపిన సందర్భాలు కూడా ఉన్నాయి.దేశీయంగా చూస్తే అమెరికా ఎదుర్కొంటున్న సవాళ్లు చిన్నవి కావు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం, మధ్యతరగతి ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొనడం, ఆరోగ్య సేవల అధిక వ్యయం, తుపాకీ సంస్కృతి కారణంగా తరచూ జరుగుతున్న కాల్పులు, రాజకీయ ధ్రువీకరణ, అక్రమ వలసల సమస్యలు దేశ భవిష్యత్తుపై ఆందోళనలు కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ రాజకీయ విభేదాలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.ప్రపంచ పరిస్థితులు కూడా అమెరికాకు కొత్త పరీక్షలను ఎదురుపెడుతున్నాయి. చైనా వేగవంతమైన ఆర్థిక, సాంకేతిక ఎదుగుదల, కృత్రిమ మేధస్సు పోటీ, సైబర్ భద్రత, వాతావరణ మార్పు, ఇంధన భద్రత, పెరుగుతున్న ప్రభుత్వ రుణభారం వంటి అంశాలు రాబోయే దశాబ్దాల్లో అమెరికా నాయకత్వాన్ని పరీక్షించనున్నాయి. ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థ క్రమంగా బహుళ ధ్రువాల దిశగా మారుతున్న నేపథ్యంలో తన ఆధిపత్యాన్ని ఎలా కొనసాగిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.అయినప్పటికీ అమెరికాను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని స్వీయ సంస్కరణ సామర్థ్యం. సంక్షోభాలు ఎదురైనప్పుడల్లా వాటి నుంచి బయటపడేందుకు కొత్త మార్గాలను అన్వేషించడం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నిరంతర పెట్టుబడులు పెట్టడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభను ఆహ్వానించడం, విమర్శలను కూడా ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగంగా స్వీకరించడం వంటి లక్షణాలు ఆ దేశాన్ని నిలబెట్టాయి. ఇదే దాని అసలైన బలం. 250 ఏళ్ల అమెరికా ప్రస్థానం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఒక దేశాన్ని కేవలం సైనిక బలం గొప్పదిగా చేయదు. బలమైన రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య సంస్థలు, విజ్ఞానంపై పెట్టుబడి, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, ప్రతిభకు గౌరవం, తప్పులను సరిదిద్దుకునే రాజకీయ సంస్కృతి వంటి అంశాలే దీర్ఘకాల విజయానికి పునాదులు. అదే సమయంలో అసమానతలు, సామాజిక విభేదాలు, అధికారం పట్ల అహంకారం, విదేశాంగ ద్వంద్వ వైఖరి ఎంతటి అగ్రరాజ్యాన్నైనా విమర్శలకు గురిచేస్తాయని అమెరికా చరిత్ర మరోవైపు గుర్తుచేస్తోంది.అందువల్ల అమెరికా 250 ఏళ్ల వేడుకలు కేవలం విజయాలను సంబరంగా గుర్తుచేసుకునే సందర్భం మాత్రమే కాదు. ప్రజాస్వామ్యం నిరంతర ప్రక్రియ అని, స్వేచ్ఛకు బాధ్యత తోడై ఉండాలని, శక్తికి నైతికత జతకావాలని ప్రపంచానికి గుర్తుచేసే చారిత్రక మైలురాయి కూడా. గత 250 ఏళ్లలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అమెరికా, రాబోయే దశాబ్దాల్లో కూడా అదే ప్రభావాన్ని కొనసాగించాలంటే తన అంతర్గత వైరుధ్యాలను అధిగమిస్తూ ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అదే దాని భవిష్యత్తు విజయానికి అసలైన ప్రమాణం.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# కొడంగల్‌లో అక్రమ ఇసుక రవాణా దందా

## చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు






**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 06:-** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పగలు తేడా లేకుండా భారీ వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నా స్థానిక అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలువెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం పలువురు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకుల అండదండలతోనే ఈ అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.రెవెన్యూ పోలీస్ మైనింగ్ శాఖల అధికారులు ఈ వ్యవహారాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని దీని వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల పంపిణీ జరుగుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అధిక లోడ్ తో ఇసుక టిప్పర్లు తిరగటం వల్ల రోడ్లు ధ్వంసం ప్రజల ఇబ్బందులు భారీ లోడుతో ప్రయాణించే టిప్పర్లు ట్రాక్టర్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారుతున్నాయి.దీనివల్ల ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు.గత 5రోజుల కింద కొడంగల్ తహసీల్దార్ కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక పైన చర్యలు తీసుకోవాలి అని తహసీల్దార్ వినతిపత్రం ఇచ్చిన ఫలితం శూన్యం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత కలిగిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్రమ ఇసుక తరలింపు పైన తక్షణ చర్యలు అవసరం ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కొడంగల్ నియోజకవర్గంలో సాగుతున్న ఈ అక్రమ ఇసుక దందాను అరికట్టాలని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టి రైతులకు సాగనీరు అందించాలి: దశరథ నాయక్ డిమాండ్..


లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దశరథ్ నాయక్..

**జర్నలిస్ట్ డైరీ: ఎల్బీనగర్:** కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతుల పనులు వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు అందజేయాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షల కోట్లు పెట్టి నిర్మించింది రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించారని అన్నారు. రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లను సాగుకు మళ్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. కాళేశ్వరం విషయమై అధికార, ప్రతిపక్ష పార్టీలు సవాళ్లు, ప్రతి సవాళ్లకు పోతే రైతులు. ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీళ్లు విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలుగు విశ్వవిద్యాలయంలో ఐదో రోజుకు చేరుకున్న దీక్షలు..



**హైదరాబాద్ (జులై 06). జర్నలిస్ట్ డైరీ.** తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. విశ్వవిద్యాలయ పరిరక్షణ, భూములు మరియు భవనాల రక్షణను డిమాండ్ చేస్తూ విద్యార్థులు తమ ఆందోళనను కొనసాగించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, కళలు, జానపదం వంటి అనేక విద్యా పీఠాలతో తెలుగు విశ్వవిద్యాలయం ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అలాంటి విశ్వవిద్యాలయ భవనాల్లో జయధీర్ తిరుమలరావుకు ఒక్క అంగుళం కూడా కేటాయించబోమని స్పష్టం చేశారు.

చెన్నప్ప రెడ్డి కమిషన్ సిఫార్సుల ప్రకారం ఒకసారి విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూములు, భవనాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు లేదని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థులను ఖాళీ చేయించి భవనాలను ఇతర అవసరాలకు కేటాయించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. అలాగే హైడ్రా ద్వారా ఖాళీ చేయించిన వేల ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయంపైనే దృష్టి సారించడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు.ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు మరింత తీవ్రంగా కొనసాగుతాయని విద్యార్థులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ అఖిల భారత విశ్వవిద్యాలయాల సహ కన్వీనర్ కమల్ సురేష్, ఏబీవీపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ గండం నరేందర్, పీహెచ్‌డీ పరిశోధకులు జనార్ధన్, సుజాత దీక్షిత్, గోపాల్, ఎస్. ఆదిత్య, వట్టిపల్లి ప్రకాశ్, ఉదయ్ కిరణ్, శరాధ, అరుణ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొని ఉద్యమానికి తమ మద్దతు ప్రకటించారు.


# పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

## - వికారాబాద్ కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన




**వికారాబాద్(జర్నలిస్టు డైరీ) జూలై 6**
పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలి విద్యారంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ధర్నా చేపట్టారులి.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటి పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రాష్ట్రంలోని సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి సంస్థలకు అప్పగించడం వల్ల విద్యార్థులకు నాసిరకం భోజనం అందుతున్న పరిస్థితి ఉందని, ఆ కాంట్రాక్టులను రద్దు చేసి గతంలో మాదిరిగా మహిళా సంఘాలకే బాధ్యతలు అప్పగించాలని కోరారు.

# కేర్‌లో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం



**హైదరాబాద్, జులై 06 జర్నలిస్ట్ డైరీ.** రొమ్ములో గడ్డ అనుమానంతో పరీక్షలకు వచ్చిన 59 ఏళ్ల మహిళలో కేర్ హాస్పిటల్స్ వైద్యులు ప్రైమరీ హైపర్ పారా థైరాయిడిజం అనే అరుదైన హార్మోన్ వ్యాధిని గుర్తించి విజయవంతంగా చికిత్స అందించినట్లు కేర్ హాస్పిటల్స్ బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ సర్జికల్ ఎండోక్రైనాలజిస్ట్ డా.సంగీతా ఝా తోకలసి ఆయన మాట్లాడుతూ మామోగ్రామ్‌లో రొమ్ము సాధారణంగా ఉన్నప్పటికీ, మూడో పక్కటెముక వద్ద బ్రౌన్ ట్యూమర్‌ను గుర్తించి తదుపరి పరీక్షల్లో ఎడమ దిగువ పారాథైరాయిడ్ గ్రంథిలో అడెనోమా ఉన్నట్లు నిర్ధారించినట్లు చెప్పారు. అనంతరం శస్త్రచికిత్స ద్వారా గ్రంథిని తొలగించగా మహిళ కోలుకున్నట్లు చెప్పారు. ప్రైమరీ హైపర్ పారా థైరాయిడిజం చాలాసార్లు లక్షణాలు లేకుండానే ఉండే 'సైలెంట్ డిసీజ్' అని, ముందస్తు నిర్ధారణతో తీవ్రమైన ఎముక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. రేడియాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జరీ, ల్యాబ్ విభాగాల సమన్వయంతో వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందించామని చెప్పారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు**



**ఉమ్మడి వరంగల్ ,జూలై 6 జర్నలిస్ట్ డైరీ**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్అన్నారు.సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ,మండలాలకు చెందిన బి ఎల్ ఏ లకు ఎమ్మెల్యే కిట్లను అందజేశారు.మున్సిపాలిటీ, మండల పరిధిలోని పార్టీ ఇన్‌చార్జిలు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రక్రియను పారదర్శకంగా,సమర్థంగా నిర్వహించాలన్నారు.ప్రజలకు అవగాహన కల్పించి ఓటరు జాబితాలోమార్పులు,చేర్పులు చేసుకునేలా బూత్ లెవెల్ ఏజెంట్లకుసూచించారు.ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి రాజేందర్,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న,సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా,ఐనవోలు దేవస్థానం చైర్మెన్ ప్రభాకర్ గౌడ్,మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి,మాజీ పట్టణ అధ్యక్షులు మైస సురేష్,సీనియర్ నాయకులు మహ్మద్ చోటు,సుధీర్ గౌడ్,మరుపట్ల సాయి,కీమా నాయక్,రజిత రెడ్డి, తుళ్ళ రవి,కౌన్సిలర్లు, సర్పంచులు,మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వండర్ హాట్ మిర్చికి పెరిగిన ధరలు...!



**ఉమ్మడి వరంగల్, జూలై 6 జర్నలిస్ట్ డైరీ**
వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్లో సోమవారం వండర్ హాట్ మిర్చి రకానికి ధర పెరిగింది. వండర్ హాట్ రకానికి రూపాయలు 28 వేలు రెండు రోజుల క్రితం ఉండగా, నేడు 33 వేలు పలికింది. అలాగే తేజ మిర్చికి రూపాయలు 21, 100 ధర నిర్ణయించారు. 341 రకం మిర్చికి 24,000 పలికింది.

## 6 వేల కోట్లతో పంచాయతీరాజ్ రోడ్లకు టెండర్లు పూర్తి: మంత్రి సీతక్క



**ఉమ్మడి వరంగల్ ,జూలై 6 జర్నలిస్ట్ డైరీ**
మేడారం అభివృద్ధి పనులు పొట్లా పూర్ లిఫ్ట్ ఇరిగేషన్, నూతన కలెక్టరేట్, హ్యాము రోడ్లు, గోదావరి కరకట్ట పనుల ప్రారంభం, శంకుస్థాపనలు త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ములుగు జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, సీఎం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే గ్రామీణ రోడ్లకు రూపాయలు 6 వేల కోట్లతో టెండర్లు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం వద్ద పంచాయతీరాజ్ శాఖకు గుర్తుగా ఏర్పాటుచేసిన పైలాన్ ను సీఎం ఆవిష్కరిస్తారని తెలిపారు. గట్టమ్మ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధి కేంద్రంగా చేస్తామన్నారు. యూరియా కొరత ఏర్పడకూడదని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు నివారణకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ , అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ చర్యలను ప్రశ్నించటమే నేరమా?


ప్రజాస్వామ్యంలో అధికారాన్ని గెలుచుకోవడం ఎంత ముఖ్యమో, అధికారాన్ని ప్రశ్నించే హక్కును కాపాడటం అంతకంటే ముఖ్యమైనది. ప్రభుత్వాలు ఎన్నికల ద్వారా వస్తాయి. కానీ రాజ్యాంగం ద్వారా ఏర్పడిన పౌర హక్కులు ఎన్నికల ఫలితాలతో మారిపోవు. ఒక ప్రభుత్వం ప్రజల విమర్శలను, అసమ్మతిని, నిరసనలను సహజ ప్రజాస్వామ్య ప్రక్రియగా స్వీకరించకుండా వాటిని నేరంగా పరిగణించడం ప్రారంభించిన క్షణం నుంచే ప్రజాస్వామ్యం బలహీనపడటం మొదలవుతుంది. గత పన్నెండేళ్లుగా దేశ రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, అధికారాన్ని ప్రశ్నించే వ్యక్తులపై తీవ్రమైన చట్టాలను ప్రయోగించడం, దీర్ఘకాలం విచారణ లేకుండానే జైళ్లలో ఉంచడం, వరుస కేసులతో వేధించడం ఒక ప్రమాదకర ధోరణిగా మారిందనే విమర్శలు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. కానీ అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి విమర్శకులనే జవాబుదారులుగా నిలబెట్టే ప్రయత్నం జరిగితే అది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. రాజకీయ నాయకులు, పాత్రికేయులు, మేధావులు, విద్యార్థి నాయకులు, రైతు ఉద్యమకారులు, సామాజిక కార్యకర్తలు, యూట్యూబ్ వ్యాఖ్యాతలు, మానవ హక్కుల కార్యకర్తలు వీరిలో ఎవరైనా ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వెంటనే దేశద్రోహం, తీవ్రవాద అనుబంధాలు, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి తీవ్రమైన ఆరోపణలు మోపడం సాధారణ ఘటనగా మారిందన్న ఆందోళన అనేక వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.ప్రత్యేకంగా చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) వినియోగంపై దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చ కొనసాగుతోంది. ఈ చట్టం అసలు ఉద్దేశం దేశ భద్రతకు నిజమైన ముప్పుగా నిలిచే ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడమే. అయితే మానవ హక్కుల సంస్థలు, న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు చాలాకాలంగా చేస్తున్న విమర్శ ఏమిటంటే, ఈ చట్టాన్ని విచారణ పూర్తికాకముందే వ్యక్తులను సంవత్సరాల తరబడి నిర్బంధించడానికి ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారనేది. జాతీయ నేర గణాంకాల వివరాలు, స్వతంత్ర అధ్యయనాలు కూడా ఒక విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. యూఏపీఏ కింద నమోదైన కేసుల్లో శిక్షల శాతం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, బెయిల్ పొందడం అత్యంత క్లిష్టంగా మారుతోంది. అంటే చివరకు నిర్దోషిగా బయటపడినా, అంతకుముందు అనుభవించిన జైలు జీవితం ఒక శిక్షగానే మిగిలిపోతోంది.దేశద్రోహ చట్టం విషయంలో కూడా న్యాయస్థానాలు పలుమార్లు కీలక వ్యాఖ్యలు చేశాయి. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం దేశద్రోహం కాదని, ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సహజ హక్కేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రభుత్వం అంటే దేశం కాదు. అధికార పార్టీ అంటే రాజ్యాంగం కాదు. పాలకులను విమర్శించడం ద్వారా దేశాన్ని అవమానించినట్లు భావించడం ప్రజాస్వామ్య అవగాహనకే విరుద్ధం.ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న కొన్ని ఘటనలు ఈ ఆందోళనను మరింత బలపరుస్తున్నాయి. ఒక సభలో చేసిన ప్రసంగం, సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్య, ప్రభుత్వ విధానాలపై వ్యక్తం చేసిన అసమ్మతి ఆధారంగా వరుసగా వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం, ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టు చేయడం వంటి పరిణామాలు న్యాయ ప్రక్రియనే శిక్షగా మార్చేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. విచారణకు ముందే వ్యక్తిని మానసికంగా, ఆర్థికంగా కుంగదీయడమే అసలు లక్ష్యంగా కనిపిస్తోందనే అభిప్రాయం పెరుగుతోంది.ఇక్కడ మరో తీవ్రమైన ప్రశ్న కూడా ఎదురవుతోంది. చట్టం అందరికీ సమానంగా అమలవుతోందా? అధికారానికి అనుకూలంగా మాట్లాడేవారికి ఒక న్యాయం, వ్యతిరేకంగా మాట్లాడేవారికి మరో న్యాయం అమలవుతోందా? మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినవారిపై చర్యలు తీసుకోవడంలో కనిపించే నిర్లక్ష్యం, అదే సమయంలో ప్రభుత్వాన్ని విమర్శించిన వారిపై అత్యంత కఠిన చట్టాలను ప్రయోగించడంలో కనిపించే వేగం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేది కేవలం చట్టాల లేమి వల్ల మాత్రమే కాదు. ఉన్న చట్టాలను ఎంపిక చేసి వక్రీకరించి అమలు చేస్తున్న విధానాలలే కారణం అవుతాయి.పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక. అది అధికార పార్టీకి అనుబంధ సంస్థ కాదు. రాజ్యాంగానికి విధేయంగా పనిచేయాల్సిన పోలీసు యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరిస్తోందనే అభిప్రాయం బలపడితే దాని మూల్యం మొత్తం సమాజమే చెల్లించాల్సి వస్తుంది. ఒకసారి ప్రజలు పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతను నమ్మడం మానేస్తే, చట్ట పాలన పునాదులే కదిలిపోతాయి.అధికారంలో ఉన్నవారు ఒక విషయం మరచిపోకూడదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం, భావప్రకటన స్వేచ్ఛ, పౌర హక్కుల గురించి గొంతెత్తిన నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత అదే హక్కులను కాలరాస్తే ప్రజలు గమనించకుండా ఉండరు. చరిత్ర చెబుతున్న ఒకే ఒక్క సత్యం ఏమిటంటే, అణచివేతతో ఏ ప్రభుత్వమూ శాశ్వతంగా నిలబడలేదు. ప్రజల అసంతృప్తిని పోలీసు కేసులతో అణచివేయాలని ప్రయత్నించిన ప్రతి పాలక వర్గం చివరకు ప్రజాస్వామ్య తీర్పు ముందు తలవంచక తప్పలేదు.ప్రభుత్వం ఎదుర్కోవాల్సిన అసలు సమస్యలు ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఉపాధి, వ్యవసాయం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, విద్య, వైద్యం, సామాజిక భద్రత ఇవే ప్రజల రోజువారీ ఆందోళనలు. వాటికి సమాధానాలు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు తన శక్తి, సామర్థ్యాలను సమస్యల పరిష్కారం కోసం కాకుండా ప్రశ్నలు సంధించిన విమర్శకులపై కేసులు నమోదు చేయడంలో ఖర్చు చేస్తే ప్రజల సమస్యలు పరిష్కారం కావు. విమర్శను అణచివేయడం వల్ల అసంతృప్తి మాయమవదు; అది మరింత లోతుగా వ్యాపిస్తుంది.ఏదో సమయంలో ఉప్పెనలా మారుతుంది.అప్పుడు అధికార మందంతో ఊగిపోతూ డైలాగులు చెప్పేవారు...ప్రజాగ్రహపు వెల్లువలో కొట్టుకు పోతారు.భారత రాజ్యాంగం పౌరులకు కేవలం ఓటు హక్కు మాత్రమే ఇవ్వలేదు. ప్రశ్నించే హక్కు, అసమ్మతి వ్యక్తం చేసే హక్కు, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ఇచ్చింది. ఇవన్నీ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనలో గుర్తింపు పొందిన ప్రాథమిక స్వేచ్ఛలే. వాటిని పరిమితం చేయడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య ఆత్మను శిక్షించడం.

ప్రభుత్వాలు మారుతుంటాయి. రాజకీయ పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ రాజ్యాంగం శాశ్వతం. అధికారాన్ని నిలబెట్టేది భయం కాదు, ప్రజల విశ్వాసం. విమర్శలను వినగలిగిన ప్రభుత్వమే బలమైన ప్రభుత్వం.ప్రశ్నించే గొంతును దేశద్రోహంగా చిత్రీకరించే ప్రభుత్వం చివరకు ప్రజాస్వామ్యాన్నే బలహీనపరుస్తుంది. అందుకే పాలకులు గుర్తుంచుకోవాల్సిన చివరి హెచ్చరిక ఒక్కటే--- ప్రశ్నించే పౌరులను శత్రువులుగా చూసే రోజు నుంచి ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది; రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రతి అడుగు చివరకు అధికారాన్నే కూలదోస్తుంది.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్






**-రూ.6.88 లక్షల నగదు స్వాధీనం**

**-నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీస్ వివరాలు వెల్లడి**

**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 06:-**
కొడంగల్ నియోజకవర్గం నారాయణపేట జిల్లాలో గత కొంత కాలంగా వరుస తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోస్గి పోలీసులు నారాయణపేట సీసీఎస్ పోలీసుల సంయుక్త బృందం అరెస్టు చేసింది.దొంగిలించిన నగదులో రూ.6,88,500 స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.జిల్లాలో ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టిన నేపథ్యంలో కోస్గి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం.54/2026, సెక్షన్ 331(3), 305 బీఎన్ఎస్ కేసును పోలీసులు శాస్త్రీయ ఆధారాలు,సాంకేతిక సమాచారంతో వేగంగా ఛేదించారు.నిందితుడు గండీడ్ మండలం లింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఏదుల బాబు (42) అని వృత్తిరీత్యా ప్రైవేట్ బస్సు డ్రైవర్ అని పోలీసులు పేర్కొన్నారు.కోస్గిలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంటాడి అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితుడి ఇంటి నుంచి రూ.6,88,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో మొత్తం దొంగిలించబడిన నగదు రూ.10,00,000 అని నిర్ధారించారు.నిందితుడు 2022 నుంచి ఇప్పటి వరకు మొత్తం 18 ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది.కోస్గి, కుల్కచర్ల,మరికల్, మహమ్మదాబాద్, మద్దూర్,నారాయణపేట,వికారాబాద్,దోమ, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇతనిపై పలు కేసులు నమోదయ్యాయి.ఆర్థిక ఇబ్బందులు అప్పులు చెడు అలవాట్ల కారణంగా పగటి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి ఇనుప పరికరాలతో తాళాలు పగులగొట్టి నగదు బంగారు ఆభరణాలు విలువైన వస్తువులు దొంగిలించేవాడు అనంతరం ఆ బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని ఆ డబ్బుతో అప్పులు తీర్చడం కుటుంబ ఖర్చులు నిర్వహించడం చెడు అలవాట్లకు ఖర్చు చేసేవాడు.ప్రజలు తమ ఇళ్లు వ్యాపార సంస్థలకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించిన వెంటనే డయల్-100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన కోస్గి సీఐ ఎ సైదులు,కోస్గి ఎస్ఐ జి పురుషోత్తం, సీసీఎస్ ఎస్ఐ విజయభాస్కర్,కోస్గి,సీసీఎస్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.ఈ సమావేశంలో డిఎస్పీలు నల్లపు లింగయ్య,మహేష్ పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధికి పెద్దపీట: రూ.24.56 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**శేరిలింగంపల్లి కొడంగల్ జులై 06:-జర్నలిస్ట్ డైరీ**

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప, గోపి నగర్, బాపు నగర్, డొయన్స్ , హాల్ కాలనీ, శిల్ప గార్డెన్, శిల్ప వ్యాలీ, సెంట్రల్ పార్క్ ఫేస్ 2, క్యాంలేట్ కాలనీ, ప్రభు పాద లే ఔట్ కేఎంఆర్ ఎస్టేట్ కాలనీల లో రూ.19 కోట్ల 18 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ , తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్ హమీద్ పటేల్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పియెసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప, గోపి నగర్, బాపు నగర్, డొయన్స్ , హాల్ కాలనీ, శిల్ప గార్డెన్, శిల్ప వ్యాలీ, సెంట్రల్ పార్క్ ఫేస్ 2, క్యాంలేట్ కాలనీ, ప్రభు పాద లే ఔట్ కే.ఏం.ఆర్ ఎస్టేట్ కాలనీల లో రూ.19 కోట్ల 18 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని తెలిపారు.సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. ఓపెన్ జిమ్ లను ప్రారంభించుకోవడం జరిగినది అని, ఆరోగ్య శేరిలింగంపల్లి నా ధ్యేయం అని, ప్రతి కాలనీ లో, పార్క్ లలో ఓపెన్ జిమ్ లను ఏర్పాటు చేస్తామని, ఓపెన్ జిమ్ ల ద్వారా ప్రతి రోజు వ్యాయమం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడుతాయి అని, వృద్ధులకు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, శేరిలింగంపల్లి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

**శంకుస్థాపన చేసిన కార్యక్రమాల వివరాలు :**

మంజూరైన అభివృధి పనుల వివరాలు

1) రాజీవ్ గృహ కల్ప కాలనీ లో రూ. 50 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
2) బాపు నగర్ కాలనీ లో రూ. 40 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
3) బాపు నగర్ కాలనీ లో రూ. 40 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
4) డోయాన్స్ కాలనీ లో రూ. 543 లక్షల తో వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు
5) ఎచ్.ఆర్.డి.సి.ఎల్ రోడ్డు లో రూ. 200 లక్షల తో వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు
6) శిల్ప గార్డెన్స్ కాలనీ లో రూ. 90 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
7) సెంట్రల్ పార్క్ ఫేస్ 2 కాలనీ లో రూ. 48 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
8) క్యాంలెట్ కాలనీ లో రూ. 130 లక్షల తో వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు
9) ప్రభు పాద లే ఔట్ కాలనీ లో రూ. 439 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు
10) హాల్ కాలనీ లో రూ. 98 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
11) కేఎంఆర్ ఎస్టేట్ కాలనీ లో రూ. 150 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు
12) టీజీఎచ్బీ కాలనీ లో రూ. 90.50 లక్షల తో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం: అనుముల మండల కాంగ్రెస్ అధ్యక్షులు రావుల శ్రీనివాస్**





**హాలియా, జులై 6 జర్నలిస్ట్ డైరీ**

భారత మాజీ ఉప ప్రధానమంత్రి, ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ సాధనకు జీవితాన్ని అంకితం చేసిన బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా హాలియా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ విశిష్ట స్థానాన్ని సంపాదించారని, అణగారిన వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, సమానత్వ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ప్రజాసేవ పట్ల ఆయన కనబరిచిన అంకితభావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# కుమారి జశ్విత జన్మదినం సందర్భంగా అనాథ చిన్నారులకు అల్పాహార సేవ

**కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**250 మందికి పైగా అనాథ, నిరుపేద చిన్నారులకు పరిశుభ్రమైన అల్పాహారం**





**ఎల్.బి.నగర్, జూలై 6 జర్నలిస్ట్ డైరీ**

కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం కుమారి జశ్విత జన్మదినాన్ని పురస్కరించుకుని ఓ అనాథ పిల్లల పాఠశాలలో అల్పాహార సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి పైగా అనాథ, నిరుపేద చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన అల్పాహారాన్ని అందించి వారి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్, సమితి సభ్యులతో కలిసి కుమారి జశ్వితతో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విద్యాభివృద్ధి, జీవితంలో ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే దాతలు, సేవాభావం కలిగిన వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని 8106876999 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యేలో ప్రజా సమస్యలపై తక్షణ స్పందన

**-ఫోన్ కాల్ వచ్చిన వెంటనే అధికారులకు ఆదేశాలు.. ప్రజలతో నేరుగా మాట్లాడిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**


**-'ప్రజల సమస్యల పరిష్కారమే నా మొదటి ప్రాధాన్యం' -- ఎమ్మెల్యే స్పష్టం**



**వలిగొండ జులై 6 జర్నలిస్ట్ డైరీ**

భువనగిరి: ప్రజల వద్దకు పరిపాలనను చేరవేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఝెఎ2చీవఝ "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా ఆలకించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్వయంగా స్పందిస్తూ ప్రతి సమస్యను ఓర్పుగా విన్న ఎమ్మెల్యే, కార్యక్రమం కొనసాగుతుండగానే సంబంధిత శాఖల అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించడం విశేషంగా నిలిచింది.తాగునీటి సమస్యలు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, రెవెన్యూ అంశాలు, పెండింగ్ పనులు వంటి అనేక ప్రజా సమస్యలను కాలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రతి అంశాన్ని వివరంగా తెలుసుకుని వెంటనే పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలపై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజలు తమ సమస్య చెప్పేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. ఎవరికైనా ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా నా దృష్టికి తీసుకురావాలి. ప్రతి సమస్యను పూర్తిగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తాను" అని తెలిపారు.అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ప్రతి గ్రామానికి చేరాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి అందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పనులను కూడా ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన పలువురు కాలర్లు, భువనగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, గతంతో పోలిస్తే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సమస్యలను స్వయంగా విని వెంటనే అధికారులతో మాట్లాడి స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం, సమస్యల పరిష్కారంలో వేగంగా స్పందించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడం ద్వారా భువనగిరి నియోజకవర్గంలో ప్రజా సేవకు కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్న నాయకుడిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని పలువురు అభిప్రాయపడ్డారు.

# బాధితుడికి మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం



**చిట్యాల జూలై06 జర్నలిస్ట్ డైరీ**

చిట్యాల మండలం వట్టిమర్తి మాజీ సర్పంచ్ బుర్రి రవీందర్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల విద్యుత్ స్తంభం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన జాల మనోజ్ను సోమవారం ఆయన పరామర్శించారు. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 30,000 ల ఆర్థిక సాయాన్ని అందజేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన మాజీ సర్పంచ్ను గ్రామస్థులు అభినందించారు.

# బిజినెస్

## E20 పెట్రోల్‌తో పాత కార్లకూ నష్టం లేదు.. మహీంద్రా స్పష్టీకరణ




దేశవ్యాప్తంగా E20 పెట్రోల్‌పై కొనసాగుతున్న చర్చల నేపథ్యంలో ప్రముఖ వాహన తయారీ సంస్థ మహీంద్రా కీలక స్పష్టీకరణ ఇచ్చింది. తమ పెట్రోల్ వాహనాల్లో E20 ఇంధనం సురక్షితంగా ఉపయోగించవచ్చని కంపెనీ వెల్లడించింది. 2025 ఏప్రిల్ 1 తర్వాత తయారైన కొత్త మోడళ్లు E20 ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించామని మహీంద్రా తెలిపింది. అయితే అంతకుముందు తయారైన వాహనాలు కూడా జు20 ఇంధనంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తాయని స్పష్టం చేసింది. సోషల్ మీడియా వేదికగా వినియోగదారులు వ్యక్తం చేస్తున్న సందేహాల నేపథ్యంలో కంపెనీ ఈ వివరణ ఇచ్చింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పెట్రోల్ ప్రమాణాలకు అనుగుణంగా తమ ఇంజిన్‌లు రూపొందించామని మహీంద్రా పేర్కొంది. దాంతో E20 పెట్రోల్‌తో మెరుగైన యాక్సిలరేషన్, ఇంధన సామర్థ్యం లభిస్తుందని కంపెనీ తెలిపింది. అయితే డ్రైవింగ్ విధానం, రహదారి పరిస్థితులను బట్టి మైలేజ్ లేదా పనితీరులో స్వల్ప మార్పులు ఉండవచ్చని కూడా స్పష్టం చేసింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో టయోటా, మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్, హుందాయ్ వంటి ప్రముఖ కంపెనీలు కూడా E20 ఇంధనం వాహనాలకు పూర్తిగా సురక్షితమని పేర్కొన్నాయి. మైలేజ్‌లో స్వల్ప తగ్గుదల ఉండవచ్చని, కానీ ఇంజిన్‌కు ఎలాంటి నష్టం ఉండదని స్పష్టంచేశాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళనలను తగ్గించేందుకు పరిశ్రమ సంస్థలు వరుసగా స్పష్టీకరణలు ఇస్తున్నాయి. E20 ఇంధనం వినియోగం భవిష్యత్‌లో సాధారణంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు అపోహలు తొలగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## బంగారం ధరల్లో మార్పులు..
# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు



ౖఅంతర్జాతీయ మార్కెట్‌లో లాభాల స్వీకరణ , డాలర్ కదలికలు, అలాగే ఫెడ్ వడ్డీ రేట్ల అంచనాల ప్రభావంతో బంగారం ధరలు తాజాగా తగ్గుముఖం పట్టాయి. దేశీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. పసిడి ధర తగ్గడంతో కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారింది. రాబోయే రోజుల్లో విలువైన లోహాల ధరల దిశ ఎలా ఉండబోతుందన్నదానిపై పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జులై 6 సోమవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.110లు తగ్గి 1,46,620 పలిగింది. 22 క్యారెట్ల బంగారం పై రూ.100లు తగ్గి రూ.1,34,400లుగా కొనసాగింది. కేజీ వెండిపై రూ.10,000లు తగ్గి రూ.2,50,000లకు చేరింది. జులై 6 సోమవారం దేశంలోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,46,770 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,34,550 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,46,620 లు, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,34,400 పలుకుతోంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,47,930 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,35,600 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,620 లు, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,400 పలుకుతోంది. కేజీ వెండి ధర రూ.2,50,000 లు పలుకుతోంది. ఈ ధరలు పెరగవచ్చు.. తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్ చేసుకొని వెళితే మంచిది.

# మైక్రోసాఫ్ట్‌లో 4,800 ఉద్యోగాల కోత..!

మైక్రోసాఫ్ట్ సంస్థ తన ప్రపంచవ్యాప్త ఉద్యోగుల్లో సుమారు 4,800 మందిని తొలగించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో, వ్యాపార సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉండగా, అమెజాన్, మెటా వంటి ఇతర టెక్ దిగ్గజాలు కూడా ఈ ఏడాది వేలాది ఉద్యోగాలను తగ్గించాయి. రాబోయే కాలంలో టెక్ కంపెనీల AI పెట్టుబడులు 700 బిలియన్ డాలర్లను దాటవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.




## శాంసన్‌పై వేటు..
# జింబాబ్వే పర్యటనకు రింకూ, ప్రభ్‌సిమ్రన్..!

ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్‌తో మేల్కొన్న భారత సెలెక్టర్లు టీ20 స్క్వాడ్‌లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కనపెట్టి.. ఐపీఎల్‌లో, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్‌గా విఫలమవుతున్న సంజూ శాంసన్(ఝుఅయబ ఝుఎంశీఅ)పై వేటు వేస్తూ.. వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ లను తీసుకున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాండ్‌పై తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడగా.. ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది.

ఇషాన్ కిషన్‌కు బ్యాకప్ వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. ఐపీఎల్- 19వ సీజన్‌లో మెరిసి ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్‌లో బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో మూడు టీ20ల సిరీస్ మొదలవ్వనుంది.





**భారత స్క్వాడ్**

శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్ కీపర్), శివం దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్.

## సూర్య కెప్టెన్సీలో అజేయశక్తి..
# అయ్యర్ వచ్చాక టీమిండియాకు ఏమైంది..?

పొట్టి ఫార్మాట్‌లో చితక్కొట్టే ఆటగాళ్లు.. వికెట్ల వేటతో భయపెట్టే బౌలర్లు.. మొన్నటిదాకా టీమిండియా సిరీస్ అంటేనే ఉలిక్కిపడేవి అన్ని జట్లు. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా బార్బడోస్ నుంచి తిరిగి వచ్చిన టీమిండియా.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో వరసగా 8 ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా కప్ కూడా కొల్లగొట్టి ప్రత్యర్థులను హడలెత్తించింది. ఆ దెబ్బతో అమ్మో.. భారత్‌తో పొట్టి సిరీస్ అంటేనే భయపడే పరిస్థితి. కానీ, ఐర్లాండ్ సిరీస్ ఓటమి అన్నింటినీ తలకిందులు చేసింది. పసికూన చేతిలో వైట్‌వాష్ ఫలితంగా భారత్‌ను మేమూ ఓడించగలమనే ఆత్మవిశ్వాసం కలుగుతోంది మిగతా టీమ్‌లకు.

సొంతగడ్డపై టీ20 వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా.. తొలి విదేశీ పర్యటనలోనే కంగుతినడం చూసి షాకవుతున్నారంతా. 'అరే.. ఇంతలోనే ఏమైంది?' రికార్డు విజయాలతో ప్రత్యర్థులను భయపెట్టిన జట్టు ఇప్పుడు హ్యాట్రిక్ ఓటములు చవిచూడడం ఏంటి?' అనేది అంతుచిక్కడం లేదు. దీనికంతటికీ కెప్టెన్సీ మార్పే కారణమా? అనే చర్చ జోరందుకుంది. కానీ, ఐపీఎల్‌లో విజయవంతమైన శ్రేయాస్ అయ్యర్ అంతర్జాతీయంగా విఫలమవ్వడం, జట్టు కూర్పులో లోపం, బౌలింగ్ యూనిట్ వైఫల్యం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.




**ఐపీఎల్ వేరు.. అంతర్జాతీయ టీ20 వేరు**

ప్రస్తుతం భారత టీ20 జట్టులోని కుర్రాళ్లంతా ఐపీఎల్‌లో పోటుగాళ్లే. వరల్డ్ నంబర్ 1 బ్యాటర్ ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ.. ఐపీఎల్‌లో రికార్డు శతకంతో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ , ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ సంజూ శాంసన్, ఆసియా కప్ హీరో తిలక్ వర్మ, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్.. ఇలా.. అందరూ ఎవరికి వారే సాటి. వీరంతా టీ20ల్లో సెంచరీలతో అలరించినవాళ్లే. కానీ, విదేశీ గడ్డపై పరిస్థితులను అర్థం చేసుకోకుండా హిట్టింగ్ ఆడాలనుకోవడం టీమిండియా ఆటగాళ్ల బలహీనతగా మారింది. పైగా.. తుది జట్టులో స్థానం కోసం పోటీ నెలకొనడంతో.. తొలి బంతి నుంచే ఉతికేస్తేనే మరో మ్యాచ్‌కు అవకాశముంటుందనే భావన కూడా వైఫల్యానికి ఓ కారణం. ఐపీఎల్‌లో ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన ప్రభావం కావచ్చు.. మన ఆల్‌రౌండర్లు అంతర్జాతీయంగా తేలిపోతున్నారు. బౌలింగ్ యూనిట్‌లో అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తిపై ఎక్కువగా ఆధారపడడం, నిలకడలేమి వంటివి విజయావకాశాల్ని దెబ్బతీస్తున్నాయి.


**స్క్వాడ్ ఎంపికతోనే**

ప్రతి సిరీస్‌కు స్క్వాడ్ ఎంపికలో కొందరికీ అన్యాయం జరుగుతోంది. ఓపెనర్‌గా అభిషేక్ శర్మ స్థిరపడగా.. సంజూ శాంసన్ మాత్రం మళ్లీ లయ తప్పాడు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ దూసుకురావడంతో ఓపెనింగ్ జోడీని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక మూడో స్థానంలో ఇషాన్ కిషన్ ఎంపిక సరైందే అనిపిస్తున్నా.. తిలక్ వర్మ విఫలమవుతున్నాడు. అంతేకాదు టాపార్డర్ నుంచి లోయర్ ఆర్డర్ వరకూ ఆరుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లే ఉండడం ప్రత్యర్థి బౌలర్ల పనిని తేలిక చేస్తోంది. దాంతో, ఒక కుడిచేతివాటం ప్లేయర్ ఉండాల్సింది అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# స్పోర్ట్స్

## అంతర్జాతీయ క్రికెట్‌లో నా ప్రస్థానం ముగిసింది..

### నా కెరీర్లో ప్రత్యేక క్షణాలు అవే..!




న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ సోఫీ డెవినె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. పొట్టి ప్రపంచకప్‌తో తన శకం ముగిస్తుందని ఇదివరకే ప్రకటించిన డెవినె.. టోర్నీ ముగిసిన మరునాడే అల్విదా చెప్పేసింది. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తనకు మద్దుతుగా నిలిచిన కోచ్‌లు, క్రికెటర్లు, కుటుంబసభ్యులకు డెవినె ధన్యవాదాలు తెలిపింది. ఇద్దరు దిగ్గజాలు సుజీ బేట్స్, తహుహులతో కలిసి చివరిసారిగా మైదానం వీడిన ఫొటోను పంచుకున్న తను.. కెరీర్లోని ప్రత్యేకమైన క్షణాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. నిరుడు వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు చేతిలో ఓటమితో వన్డేలకు స్వస్తి పలికిన సోఫీ డెవెనె ఈసారి టీ20లకూ బైబై చెప్పేసింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన న్యూజిలాండ్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో ఆమె కెరీర్ ముగిసినా.. టోర్నీ పూర్తి కావడంతో ఈ విషయాన్ని అధికారికంగా డెవినె వెల్లడించింది. 2024లో జట్టును తొలిసారి టీ20 వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన డెవినె జూలై 6న ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన క్రికెట్ ప్రయాణాన్ని తలచుకుంటూ అందరికీ కృతజ్ఞతలు చెప్పింది. 'గత ఇరవై ఏళ్లు ఎలా ముగిశాయో తెలియడం లేదు. కానీ, ఇద్దరు గొప్ప సహచరిణులతో కలిసి చివరిసారి మైదానం వీడడం నా అంతర్జాతీయ క్రికెట్‌కు అర్థవంతమైన ముగింపు. నా క్రికెట్ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు చెబుతానో లేదో నాకు తెలియదు. లేదంటే న్యూజిలాండ్‌లోని సగం మందికి నేను కృతజ్ఞతలు చెప్పాల్సి ఉంటుంది. కోచ్‌లు, ఫీజియో, ట్రైనర్స్, అధికారులు, అభిమానులు, మీడియాకు ధన్యవాదాలు. నాకు మద్దతుగా నిలిచినందుకు, నన్ను ప్రోత్సహించినందుకు, ముఖ్యంగా నన్ను భరించినందుకు కృతజ్ఞతలు. వైట్ ఫెర్న్స్ సభ్యులు.. నేను ఆడడానికి మీరే కారణం. విశ్వ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించడం.. అందరం పక్కపక్కనే నిల్చోవడం వంటివి నన్ను ఎంతగానో గర్వించేలా చేశాయి. చివరగా నా కుటుంబసభ్యులు. వారు చూస్తుండగా నేను చివరిసారిగా మైదానం వీడడం నా కెరీర్లోనే ఎంతో ప్రత్యేకమైన క్షణాలు. మంచి రోజులు, కొన్ని చెడ్డ రోజుల్లో నాకు అండగా నిలిచిన మీకు ధన్యవాదాలు' అని డెవినె తన వీడ్కోలు పోస్ట్‌లో పేర్కొంది.

**పేస్ ఆల్‌రౌండర్‌గా**

ఒకప్పుడు క్రికెట్‌కు ఏమంత ఆదరణ లేని న్యూజిలాండ్‌లో యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది సోఫీ డెవినె. 2006 అక్టోబర్ 22న తొలి వన్డే ఆడిన ఆమె.. అనతికాలంలోనే జట్టులో కీలకమైంది. పేస్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ.. ఓపెనర్‌గా శుభారంభాలు ఇస్తూ ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమైంది డెవినె. 20 ఏళ్ల సుదీర్ఘ కెరీర్లో 159 వన్డేలు ఆడిన తను.. 9 శతకాలు, 18 హాఫ్ సెంచరీలతో కలిపి 4,279 పరుగుల చేసింది. బంతితోనూ సత్తా చాటి 111 వికెట్లు పడగొట్టింది. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.. 3/24. టీ20ల్లో 158 మ్యాచులు ఆడి 3,817 రన్స్ కొట్టింది డాషింగ్ బ్యాటర్.

# అప్పుడే అఖిల్ అక్కినేని 'లెనిన్' ఓటీటీ రిలీజ్ అప్‌డేట్..


## -ఇంతకీ ఏ ప్లాట్‌ఫాంలోనో తెలుసా.. ?




చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది.ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.




# తొలి భాగంలో తక్కువే కనిపిస్తా



సాయిపల్లవి, రణబీర్‌కపూర్ సీతారాములుగా నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పానిండియా పౌరాణిక ఇతిహాసం 'రామాయణ'లో రావణుడి భార్య మండోదరిగా కాజల్ అగర్వాల్ నటిస్తున్న విషయం తెలిసిందే. తాను పోషిస్తున్న మండోదరి పాత్ర గురించి తాజా ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడుతూ- 'ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతున్నది. మేం ఇప్పటివరకూ తొలి భాగానికి చెందిన షూట్‌ని మాత్రమే పూర్తి చేశాం.ఫస్ట్ పార్ట్‌లో రావణ లంక సన్నివేశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, నా పాత్ర నిడివి కూడా తక్కువే ఉంటుంది. సెకండ్ పార్ట్‌లో నా పాత్ర చాలా బలంగా ఉంటుంది. ఏదేమైనా ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా యశ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం గొప్ప అనుభవం. రావణ పాత్ర కోసం యశ్ చాలా శ్రమిస్తున్నారు. వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా' అంటూ చెప్పుకొచ్చింది కాజల్ అగర్వాల్.



# కింగ్ నాగార్జున 100వ సినిమాలోవిలన్‌గా టబూ ..

## -జూలై 10 తర్వాత రానున్న అప్‌డేట్‌పై భారీ ఆసక్తి!



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జూలై 10, 2026 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది.గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే ఈసారి కూడా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, దర్శకుడు రా. కార్తీక్ తెరకెక్కిస్తున్న 'కింగ్100' ఓ ర్యాగ్స్-టు-రిచెస్ డ్రామాగా రూపొందుతోంది. తండ్రి-కూతురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటికే పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. తన 100వ సినిమా గురించి జూలై 10 తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తానని నాగార్జున స్వయంగా ప్రకటించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మరోవైపు టబూ పాత్రకు సంబంధించిన వార్తలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

# హీరో చెప్పిందే ఫైనల్..

## -జెండర్ వివక్షపై కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు

సినీ పరిశ్రమ వెలుపల నుంచి చూస్తే గ్లామర్, స్టార్‌డమ్ మాత్రమే కనిపిస్తాయి. కానీ ఆ మెరుపుల వెనుక ఎన్నో అసమానతలు, సవాళ్లు, వివక్ష కూడా ఉంటాయని పలువురు నటీమణులు గతంలో వెల్లడించారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ కూడా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొనే జెండర్ వివక్షపై బహిరంగంగా మాట్లాడి చర్చనీయాంశంగా మారారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి సనన్.. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న కొన్ని చేదు అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా సినిమా ప్రమోషన్స్ సమయంలో ఓ హీరో తనను కావాలనే పక్కన పెట్టేందుకు ప్రయత్నించాడని, తాను ఏ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరుకావాలో కూడా ఆయనే నిర్ణయించాలనుకున్నాడని తెలిపారు.అలాంటి పరిస్థితి తనకు తీవ్ర అవమానంగా అనిపించిందని, నా అవసరం లేదనుకుంటే మీరు ఒక్కరే సినిమా ప్రమోట్ చేసుకోండి అని చెప్పి తాను వెనక్కి తగ్గినట్లు వెల్లడించారు. సినిమా సెట్స్‌లో కూడా మహిళా నటీమణులకు, పురుష నటులకు ఇచ్చే ప్రాధాన్యంలో స్పష్టమైన తేడా కనిపించేదని కృతి అన్నారు. హీరోలకు పెద్ద వానిటీ వాన్లు, విశాలమైన గదులు, లగ్జరీ కార్లు ఏర్పాటు చేస్తే.. హీరోయిన్లకు మాత్రం చిన్న గదులు, సాధారణ వాహనాలు కేటాయించేవారని చెప్పారు. తనకు గదుల పరిమాణం లేదా కార్లపై ఆసక్తి లేదని, కానీ అలాంటి తేడాలు మహిళలను తక్కువగా చూసే భావనను కలిగిస్తాయని ఆమె వ్యాఖ్యానించారు. సీనియర్ హీరోల విషయంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు సహజమేనని అంగీకరించిన కృతి.. కొత్తగా వచ్చిన హీరోల విషయంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్లు హీరో సమయాన్ని దృష్టిలో పెట్టుకుని హీరోయిన్లను గంటల ముందే సెట్స్‌కు పిలిచి వేచి ఉండేలా చేసేవారని ఆమె విమర్శించారు. తాను నటనలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ తీసుకోకపోవడంతో పాత్ర గురించి దర్శకులను ప్రశ్నిస్తే లేదా ఏదైనా సూచన చేస్తే.. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావ్ అంటూ తన మాటలను పట్టించుకునేవారు కాదని కృతి తెలిపారు. అయితే అదే విషయాన్ని ఓ పురుష నటుడు చెబితే వెంటనే అంగీకరించి, అతని సూచనకు ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు. మహిళలు అభిప్రాయం చెబితే దాన్ని అతిగా చూస్తారని, పురుషులు మాట్లాడితే మాత్రం దాన్ని వారి కమిట్‌మెంట్‌గా భావిస్తారని ఆమె విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో మౌనంగా ఉండడం కంటే, సమాన గౌరవం కోసం గొంతు విప్పడం అవసరమని కృతి సనన్ అభిప్రాయపడ్డారు. కార్యాలయంలో గానీ, సినిమా సెట్స్‌లో గానీ మహిళలకు సమాన అవకాశాలు, గౌరవం దక్కాలని ఆమె కోరారు.

# పవన్ ఫ్యాన్స్‌కు బర్త్‌డే ట్రీట్.. మళ్లీ థియేటర్లలోకి 'పంజా'




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు బర్త్‌డే సందర్భంగా ప్రత్యేక కానుక సిద్ధమైంది. దర్శకుడు విష్ణువర్ధన్ తెరకెక్కించిన స్టైలిష్ యాక్షన్ చిత్రం 'పంజా' సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మళ్లీ థియేటర్లలో రీ-రిలీజ్ కానుంది. 2011లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తర్వాత కల్ట్ ఫాలోయింగ్ సంపాదించింది. పవన్ స్టైలిష్ లుక్, యాక్షన్ సన్నివేశాలు, సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. ఇప్పటికే పలువురు స్టార్ హీరోల చిత్రాల రీ-రిలీజ్‌లు విజయవంతం కావడంతో, 'పంజా' కూడా మంచి స్పందన అందుకుంటుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465